ఆయిల్‌పామ్ గెల టన్ను రూ. 21వేలు

వెల్లడించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ గెల టన్ను ధర రూ. 21వేలకు పెరిగినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. బహిరంగ మార్కెట్లో డిమాండ్ పెరుగుతుండడంతో ఆయిల్‌పామ్ ధర క్రమంగా పెరుగుతున్నదని తెలిపారు. దీంతో ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభదాయకమని పేర్కొన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు మొగ్గుచూపి.. లాభాలు గడించాలని ఆయన సూచించారు.

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల నుంచి రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే తొలిరోజు 11 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేశారు.

11 నుంచి 14వరకు వ్యవసాయ మహోత్సవం

బ్రోచర్ విడుదల చేసిన కోదండరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ అగ్రి- హార్టికల్చర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 14వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తెలంగాణ వ్యవసాయ మహోత్సవం -2025 పేరుతో వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. మంగళవారం వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో 'తెలంగాణ వ్యవసాయ మహోత్సవం-2025' బ్రోచర్‌ను కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డితో కలిసి కోదండరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల పెట్టుబడి పెరిగినా ధర రావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. రానురాను పంట పొలాల భూసారం తగ్గిపోతున్నదని తెలిపారు.

జానారెడ్డి లేఖతో ఎవరికి చెక్?

- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలకు ప్రాధాన్యమివ్వాలి
- రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ కీలక నేతలకు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులకు అవకాశం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ కే జానారెడ్డి ఏఐసీసీ పెద్దలు మల్లికార్జునఖర్గే, కేసీ వేణుగోపాల్‌కు మంగళవారం లేఖ రాశారు. జానారెడ్డి ఎవరికైనా మద్దతునిస్తూ లేఖ రాశారా? అన్నది తెలియరాలేదు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో ఆరు ఖాళీలుండగా, ఉన్నవారిలో ఇద్దరిని తొలగించి మొత్తం ఆరుగురు కొత్తవారికి క్యాబినెట్‌లో స్థానం కల్పిస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఈ విస్తరణతో మంత్రివర్గంలో అన్ని సామాజికవర్గాలకు చోటు కల్పిస్తారని సమాచారం. ఇప్పటికైతే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, బోధన్ ఎమ్మెల్యే పీ సుదర్శన్ రెడ్డి పేర్లు ఖరారైనట్టు ప్రచారం జరుగుతున్నది. అయితే జానారెడ్డి ప్రత్యేకంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గ విస్తరణలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ లేఖ రాయడం పార్టీ వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది. నల్లగొండ జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే తన భార్యకు కూడా ఇవ్వాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టుబడుతున్నారు. ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఒత్తిడి పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు అవకాశం కల్పిస్తే రాజగోపాల్‌రెడ్డికి అవకాశం దక్కకుండా పోతుందని, తద్వారా అటు ఉత్తమ్‌కు, ఇటు రాజగోపాల్‌రెడ్డికి చెక్ పెట్టవచ్చనే ఉద్దేశంతోనే జానారెడ్డి లేఖ రాసి ఉంటారనే ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ తరపున ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి నుంచి రామ్మోహన్‌రెడ్డి, తాండూరు నుంచి మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి ప్రస్తుతం మంత్రి పదవి కోసం పోటీపడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నట్టు తెలిసింది. జానారెడ్డి రాసిన లేఖలో ఎవరికీ ప్రత్యేకంగా మద్దతు ప్రకటించనప్పటికీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలతోపాటు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం దక్కలేదనే విమర్శలు వ్యక్తమవుతాయనే సాకుతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి దక్కకుండా చేయడంలో భాగంగానే లేఖ రాసినట్టు ప్రచారం జరుగుతున్నది. మంత్రివర్గ విస్తరణకు గురువారం ముహూర్తం ఖరారైనట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

మా జిల్లాకో మంత్రి పదవి కావాలి

- ఏఐసీసీకి రంగారెడ్డి, హైదరాబాద్ కాంగ్రెస్ నేతల వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు చోటు కల్పించాలని ఏఐసీసీ పెద్దలను ఆ జిల్లా నేతలు కోరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ పెద్దలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు వేర్వేరుగా వారు మంగళవారం ఢిల్లీలో లేఖలు అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా నుంచి ఆరుగురికి అవకాశం కల్పించిందని లేఖలో గుర్తుచేశారు. లేఖలపై సంతకాలు చేసినవారిలో స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్, ఇబ్రహీంపట్నం, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం రామ్‌రెడ్డి ఉన్నారు.

హనుమకొండ జిల్లా ఆత్మకూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఉచిత బస్సు స్కీమ్ మాకొద్దు సారూ!

- టికెట్ లేదని మమ్మల్ని గౌరవిస్తలేరు
- కండక్టర్లు, డ్రైవర్లు ఇష్టమున్నట్టు మమ్మల్ని మాట్లాడుతున్నరు
- పథకాన్ని ఎత్తేయాలని ఎమ్మెల్యే రేవూరితో మొరపెట్టుకున్న ఆత్మకూరు గ్రామ మహిళలు

ఆత్మకూరు, ఏప్రిల్ 1: ఉచిత బస్సు ప్రయాణం తమకొద్దంటూ మహిళలు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కేంద్రంలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఉచిత బస్సు సౌకర్యాన్ని వెంటనే తీసేయాలని మహిళలు వేడుకున్నారు. కంగుతున్న ఎమ్మెల్యే.. ఎందుకు తీసేయాలని ఆరా తీయగా.. ప్రభుత్వం బస్సు చార్జీలు తీసుకుంటేనే తమకు గౌరవం దక్కుతుందని, ఉచితంగా ప్రయాణిస్తున్నామని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు ఇష్టానుసారంగా మాట్లాడుతుండటం తమను బాధిస్తున్నదని చెప్పారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. అవసరమైతే డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించి గౌరవం దక్కేలా చూస్తానని సర్దిచెప్పారు. ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయిందని, పథకాలు పూర్తిగా అందించలేకపోతున్నామని ఆయన స్పష్టంచేశారు.

41వ సారి ఢిల్లీకి సీఎం

- బీసీల ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి బృందం
- అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీల బిల్లు ఏమైంది?
- గవర్నర్ ఆమోదం పొందకుండా ఢిల్లీ వెళ్లి డ్రామా ఎందుకు?
- సర్కారు తీరుపై పలు బీసీ సంఘాలు, మేధావుల ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): వెనుకబడిన వర్గాల వారికి విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తరువాత బిల్లు గతి ఏమిటో వెల్లడించకుండా ఢిల్లీ డ్రామాకు తెరలేపిందని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. శాసనసభలో ఆమోదం పొందిన బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపారా? లేక అసెంబ్లీ కార్యదర్శి వద్దనే పెండింగ్‌లో పెట్టారా? అన్న విషయాన్ని బయటపెట్టకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ ఢిల్లీ కేంద్రంగా డ్రామాలు ఆడుతున్నారంటూ మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి 41వ సారి ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం కొన్ని సంఘాలు తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం వెళ్లిందని సీఎంవో కార్యాలయం తెలిపింది. సీఎంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తదితరులు మంగళవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారని పేర్కొంది.

9వ షెడ్యూల్ పేరిట వంచన

బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడే బీసీ కమిషన్, డెడికేటెడ్ కమిషన్ నివేదికలను అధికారికంగా ఉభయ సభల్లో వెల్లడించాల్సి ఉండిందని బీసీ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

ఢిల్లీ డ్రామా పెద్ద మోసం:రాజారాం

అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో కూడా ఆమోదించాలని డిమాండ్ చేస్తూ కొన్ని కాంగ్రెస్ అనుబంధ సంఘాలు ఢిల్లీలో ధర్నాకు పిలుపునిచ్చాయని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆరోపించారు. అసెంబ్లీలో ఆమోదించిన రిజర్వేషన్ బిల్లు ఇప్పుడు ఎక్కడున్నదో చెప్పకుండా, ఢిల్లీలో డ్రామాలు ఆడటం బీసీలను మోసం చేయటమేనని దుయ్యబట్టారు. పార్లమెంటు కంటే ముందు బిల్లు గవర్నర్ ఆమోదం పొందాలని అన్నారు. గవర్నర్‌కు పంపి ఉంటే బిల్లులో లోపాలు బయటపడేవని తెలిపారు. కానీ ఏకంగా ఢిల్లీకి వెళ్లి పార్లమెంటులో ఆమోదించాలని డిమాం డ్ చేయటం బీసీలను వంచించటమేనని విమర్శించారు.

సర్కారు ఆదేశాలకే దిక్కులేదా?

- విద్యుత్తు సంస్థల్లో అమలుకు నోచని సర్కారు ఉత్తర్వులు
- రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలి అన్న ఆదేశాలు బేఖాతరు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిపోయింది. అన్ని శాఖల్లోని రిటైర్డ్ ఉద్యోగులను మార్చి 31లోగా తొలగించాలని ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఇప్పటికే పలుశాఖల్లో రిటైర్డ్ అయిన వారికి ఉద్వాసన పలికారు. కానీ మంగళవారం వరకు ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లను మాత్రం తొలగించకపోవడం గమనార్హం. విద్యుత్తు సంస్థల్లోని డైరెక్టర్లు సైతం ఆదేశాలు రావడమే తరువాయి, వైదొలగేందుకు తట్టా బుట్టా సర్దుకున్నారు. కానీ వారిని తొలగిస్తున్నట్టు విద్యుత్తు సంస్థల ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. మొత్తంగా సర్కారు ఉత్తర్వులను విద్యుత్తు సంస్థల ఉన్నతాధికారులే ఖాతరు చేయకపోవడం గమనార్హం.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఎమ్మెల్యే నాగరాజును అడ్డుకుంటున్న ఇసుక కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు

ఎమ్మెల్యేను అడ్డుకున్న ఇసుక కూలీలు

- ఆకేరు వాగు నుంచి ఇసుక రవాణా నిలిపివేయడంపై ఆగ్రహం
- ఉపాధి పోయిందని కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్ల ఆందోళన

వర్ధన్నపేట, ఏప్రిల్ 1: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు చేదు అనుభవం ఎదురైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు మంగళవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఇసుక కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు ఎమ్మెల్యేను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆకేరువాగు నుంచి ఇసుక రవాణా చేయకుండా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవడంతో తాము పూర్తిగా ఉపాధి కోల్పోయామని ఆందోళన వ్యక్తంచేశారు. పూర్తిగా వాగు ఇసుక మీదనే ఆధారపడి దశాబ్దాలుగా జీవిస్తున్నామని, ఇప్పుడు అధికారులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి పంపించేందుకు ప్రయత్నించారు. కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఓట్లు వేసి గెలిపిస్తే తమకే ఉపాధి లేకుండా చేసిన ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం చెబుతామని ఈ సందర్భంగా కూలీలు హెచ్చరించారు.

వాణిజ్య

3.44 లక్షల కోట్లు ఆవిరి

టారిఫ్ భయాలతో కుప్పకూలిన సూచీలు

సెన్సెక్స్ 1,390, నిఫ్టీ 354 పాయింట్లు పతనం

ముంబై, ఏప్రిల్ 1: నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభరోజు దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతికార సుంకాలపై తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు ఇదే ధోరణిని ప్రదర్శించాయి. ఒక దశలో 1,500 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 1,390 పాయింట్లు(1.80 శాతం)కోల్పోయి 76,024.51 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో 28 సూచీలు నష్టపోగా, కేవలం రెండు సూచీలు లాభాల్లో ముగిశాయి. మరో సూచీ నిఫ్టీ కూడా భారీగా నష్టపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి నిఫ్టీ 353.65 పాయింట్లు(1.50 శాతం) కోల్పోయి 23,165.70 వద్ద నిలిచింది. గడిచిన నెలరోజుల్లో ఒకేరోజు ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి. దీంతో ముదపరులు రూ.3.44 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.3,44,058.44 కోట్లు కరిగిపోయి రూ.4,09,43,588.06 కోట్లు(4.78 ట్రిలియన్ డాలర్లు) పడిపోయింది. అమెరికాపై అత్యధికంగా ఆధారపడివున్న దేశీయ ఐటీ సంస్థలకు ట్రంప్ సెగ గట్టిగానే తగిలిందని, దీంతో ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లు కుప్పకూలాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేరు 3.87 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా షేర్లు రెండు శాతం వరకు నష్టపోయాయి.
- రిలయన్స్, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, కొటక్ బ్యాంక్, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, నెస్లె, ఐటీసీ, టాటా స్టీల్, అదానీపోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, మారుతి, టాటా మోటర్స్, ఎస్బీఐ షేర్లు నష్టపోయాయి.
- ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 5.11 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు యెస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, జొమాటో షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి.
- రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 3.05 శాతం నష్టపోయింది. అలాగే కన్స్యూమర్ డ్యూరబుల్ 2.51 శాతం, ఐటీ 2.42 శాతం, ఆర్థిక సేవలు 1.78 శాతం, టెక్నాలజీ 1.73 శాతం, బ్యాంకింగ్ 1.50 శాతం చొప్పున పతనం చెందాయి.

తులం రూ.94,150

బంగారం ధరలు ఆకాశమే హద్దు అన్నట్టు దూసుకుపోతున్నాయి.

- *దేశీయ మార్కెట్‌లో పసిడి రేట్లు ఒక్కరోజే మరో రూ.2వేలు ఎగిసి ఆల్ టైమ్ హైకి చేరాయి.*

24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి విలువ తొలిసారి రూ.94,150 పలికింది. గడిచిన 3 నెలల్లో రూ.15,200 ఎగబాకింది.

బంగారం ధరలు హై జంప్ • ఒక్కరోజే రూ.2వేలు పెరిగిన రేటు
దేశీయ మార్కెట్‌లో సరికొత్త స్థాయికి చేరిక
ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూ.15,200 ఎగిసిన విలువ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: బులియన్ మార్కెట్‌లో బంగారం ధగధగలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సామాన్య, సగటు మధ్యతరగతి వర్గాలకు అందనంత ఎత్తుకు ఎగబాకిన గోల్డ్ రేట్లు.. ఇంకా పైకి పోతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం దేశీయంగా మరో ఆల్‌టైమ్ హైని చేరాయి. ఈ ఒక్కరోజే 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర ఢిల్లీలో మునుపెన్నడూ లేనివిధంగా రూ.94,150గా నమోదైంది. ఏకంగా ఒకేసారి తులం విలువ రూ.2,000 ఎగిసింది. దాదాపు గడిచిన రెండు నెలల్లో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. ఫిబ్రవరి 10న రూ.2,400 పెరిగింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే. మరోవైపు మార్కెట్‌లో ధరలు పరుగులు పెడుతుండటంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా బంగారం రేటు రూ.15,200 పుంజుకున్నది. గత ఏడాది డిసెంబర్ 31న 24 క్యారెట్ గోల్డ్ ధర రూ.78,950 వద్ద ముగిసింది.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లోనూ గోల్డ్ రేట్లు దూకుడు మీదున్నాయి. 24 క్యారెట్ తులం రూ.930 ఎగిసి రూ.92,840 పలికింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.850 పెరిగి రూ.85,100గా ఉన్నది. గత వారం రోజుల్లో 24 క్యారెట్ రేటు రూ.3,550, 22 క్యారెట్ 3,250 ఎగబాకడం గమనార్హం. కాగా, స్టాక్ హోల్డర్లు, జ్యుయెల్లర్స్ నుంచి అమాంతం పెరిగిన డిమాండే మార్కెట్‌లో ఈ అప్ ట్రెండ్‌కు కారణమని అఖిల భారత సరఫా అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. స్టాక్ మార్కెట్లు నష్టపోతుండటంతో అక్కడి పెట్టుబడులకు ప్రత్యామ్నాయంగా మదుపరులకు బంగారమే కనిపిస్తున్నదని, ఇది కూడా ధరలను ఎగదోస్తున్నదని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ఇదిలా వుంటే ఢిల్లీలో వెండి ధర కిలో రూ.500 తగ్గింది. 1,02,500కు పరిమితమైంది. ఇక ఫ్యూచర్ మార్కెట్‌లో గోల్డ్ రేటు జూన్ డెలివరీకిగాను రూ.91,400 పలికింది. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ రికార్డు స్థాయిలో 3,149.03 డాలర్లను తాకింది.

ధరల పెరుగుదలకు కారణాలు

- స్టాక్‌హోల్డర్లు, జ్యుయెల్లర్స్ నుంచి డిమాండ్
- పెరిగిన మదుపరుల పెట్టుబడులు
- భౌగోళిక, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు
- ట్రంప్ టారిఫ్‌ల పెంపు భయాలు
- స్టాక్ మార్కెట్లలో నష్టాలు

కాగ్నిజెంట్ గ్లోబల్ హెడ్‌గా శైలజ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కాగ్నిజెంట్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ) హెడ్‌గా శైలజా జోస్యుల నియమితులయ్యారు. హైదరాబాద్‌కు చెందిన శైలజకు టెక్నాలజీ రంగంలో 30 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 2018 నుంచి 2024 మధ్యకాలంలో ఈవైలో విధులు నిర్వహించిన శైలజ..తిరిగి కాగ్నిజెంట్‌లో చేరారు. ఇప్పటికే హైదరాబాద్ సెంటర్ హెడ్‌గాను, బీఎఫ్ఎస్ఐ గ్లోబల్ హెడ్‌గాను విధులు నిర్వహించారు కూడా. ఈ సందర్భంగా కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ సౌర్య గుమ్మడి మాట్లాడుతూ..టెక్నాలజీ రంగంలో విశేష అనుభవం ఉన్న శైలజ అనుభవాలు తమ జీసీసీ విస్తరణకు దోహదం చేయనున్నాయన్నారు.

అన్నీ ఉత్త మాటలే..

హైదరాబాద్‌లో ఈవీ ప్లాంట్ పెట్టే యోచనేదీ లేదు

పెట్టుబడుల వార్తలు అంతా అబద్ధం.. ప్రకటించిన బీవైడీ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): చైనాకు చెందిన విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) తయారీ దిగ్గజం బీవైడీ (బిల్డ్ యువర్ డ్రీమ్స్).. తెలంగాణలో కార్ల తయారీ పరిశ్రమ ఏదీ లేదని ప్రకటించింది. హైదరాబాద్‌లో 1.4 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఈవీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. ఈ మేరకు టెక్‌ఇన్‌ఏషియా.కామ్ చెప్తున్నది. అలాగే తమ వుయ్‌చాట్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన ఓ అధికారిక ప్రకటనలో ఈ వార్తలన్నీ అబద్ధాలని బీవైడీ సైతం పేర్కొనడం గమనార్హం. కాగా, చైనా ప్రముఖ బిజినెస్ మీడియా సంస్థ యికై గ్లోబల్ మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. దీంతో యికై చైనాలోని అత్యంత ప్రధాన బిజినెస్ మీడియా కావడంతో ఈ అంశాన్ని కొట్టిపారేయలేమని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

2020లో కేటీఆర్ చొరవతో..

బీవైడీ ఇప్పటికే మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) గ్రూప్‌తో భాగస్వామ్యం కలిగి ఉన్నది. మెఘా కంపెనీకి చెందిన ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల తయారీకి బీవైడీ సహకరిస్తున్నది. దీంతో తెలంగాణలో బీవైడీ కార్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అడుగులు పడ్డాయి. నాటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో ఏటా 10,000-15,000 ఎలక్ట్రిక్ కార్లను ఉత్పత్తి చేయాలనే ప్రణాళికల్ని బీవైడీ రూపొందించింది. కానీ భారత్-చైనా సరిహద్దుల మధ్య ఏర్పడిన ఉద్రిక్తకర పరిస్థితుల వల్ల కేంద్ర ప్రభుత్వం దేశంలోకి చైనా కంపెనీల రాకపై కఠిన ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో బీవైడీ తెలంగాణకు వచ్చే ప్రతిపాదన అటకెక్కింది. అయితే ఇటీవల భారత్-చైనా మధ్య వ్యాపార సంబంధాలు మెరుగవుతున్న తరుణంలో మళ్లీ బీవైడీ తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నదన్న ప్రచారం జోరందుకున్నది. పైగా మార్కెట్‌లో బీవైడీకి పోటీదారుగా ఉన్న అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ టెస్లా ఏపీలో పెట్టుబడి పెట్టనున్నట్టు వార్తలొస్తున్న నేపథ్యంలో ఈ ప్రచారం మరింత ఊపందుకున్నది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఒలెక్ట్రా పరిశ్రమకు సమీపంలోని సీతారాంపూర్‌లో 150 ఎకరాలు లేదా షాబాద్ మండలంలోని చందన్‌వల్లి వద్ద 200 ఎకరాల భూమిని బీవైడీ కోసం ఎంపిక చేసినట్టు వార్తలొచ్చాయి. అంతేగాక షాద్‌నగర్ వద్ద ఏర్పాటవుతున్న బ్యాటరీల పరిశ్రమకు సమీపంలోనే బీవైడీకి భూములు కేటాయించే వీలుందని కూడా తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ వార్తల్ని బీవైడీ ఖండించినట్టు బయటకు రావడం ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నది.

బీవైడీ వస్తుంది.. కానీ

బీవైడీ రాష్ట్రానికి వస్తుందని, అయితే ఇప్పుడే దీనికి సంబంధించి అధికారికంగా వెల్లడించే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే బీవైడీ ఈ వార్తలను ఖండించడంపై మాట్లాడేందుకు వారు నిరాకరిస్తున్నారు.

పరిశ్రమలు యూటర్న్